Cell: 9440352036 మా ప్రతి అక్షరం - ప్రజల కోసం

# చిత్తూరు ఎక్స్‌ప్రెస్

జాతీయ తెలుగు దినపత్రిక

APTEL/2024/86143

WANTED
స్టాఫ్ రిపోర్టర్లు కావలెను
చిత్తూరు ఎక్స్‌ప్రెస్ దినపత్రికలో పనిచేయుటకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అన్ని మండల కేంద్రాలలో రిపోర్టర్లు, జిల్లా కేంద్రాలలో స్టాఫ్ రిపోర్టర్లు కావలెను
సంప్రదించండి సెల్ : 9440815774

ప్రచురణ : తిరుపతి | సంపుటి : 02 | సంచిక : 140 | అసోషియేట్ ఎడిటర్ : కే ఎల్ కృష్ణంరాజు | ఆదివారం 14 జూన్ 2026 | పేజీలు : 4 | వెల : 3

## అందరికీ నీతులు చెప్పే ప్రకాశ్ రాజ్ ఇలాంటి చర్యలకు పాల్పడడం విడ్డూరంగా ఉంది



- నటుడు ప్రకాశ్ రాజ్‌పై ఏపీ బీజేపీ ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి తీవ్ర ఆరోపణలు
- ధర్మస్థలం పవిత్రతను దెబ్బతీసేందుకు కుట్ర పన్నారని విమర్శ
- కేరళ నుంచి రూ.200 కోట్లతో దుష్ప్రచారం చేశారని ఆరోపణ
- నిజాలు తేలాలని, దోషిగా తేలితే చట్టప్రకారం శిక్షించాలని డిమాండ్



## పంజాబ్‌లో ఒంటరిగానే బీజేపీ పోరు

- 117 స్థానాల్లో పోటీకి సిద్ధం!
- 2027 పంజాబ్ అసెంబ్లీ ఎన్నికల్లో పొత్తులు ఉండవని స్పష్టం చేసిన బీజేపీ
- అన్ని 117 అసెంబ్లీ స్థానాల్లో పోటీ చేస్తామని ప్రకటించిన పంజాబ్ బీజేపీ నేతలు



## భారత్ నిర్ణయంతో పాక్ అల్లకల్లోలం!

- సుక్కూర్ బ్యారేజ్‌లో పడిపోయిన నీటిమట్టం
- బలూచ్, సింధ్ ప్రావిన్స్‌ల్లో ప్రమాదకర పరిస్థితులు!
- సింధూ జలాల ఒప్పందం నిలిపివేత ప్రభావం పాక్‌పై తీవ్రం
- సుక్కూర్ బ్యారేజ్ పరిధిలో కాలువలు ఎండిపోవడంతో రైతుల ఆందోళన
- సింధ్‌కు నీరు అందకపోతే పాక్ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావమని నిపుణుల హెచ్చరిక

## రెండేళ్లలో మారిన పోలవరం

# రూపురేఖలు



- పరుగులు పెడుతున్న పనులు
- కూటమి సర్కార్ రాకతో ప్రాజెక్టుకు సరికొత్త వెలుగులు
- డి-వాల్‌ను 14 పూర్తి చేసి రికార్డు సృష్టించిన ప్రభుత్వం
- గోదావరి పుష్కరాల లోపే ప్రాజెక్టు పూర్తి చేసే దిశగా అడుగులు

**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అమరావతి**

తుగ్లక్ మార్క్ నిర్ణయాలు, ఘోర తప్పిదాలు, అడ్డగోలుగా రివర్స్ టెండర్లు, కొట్టుకుపోయిన కోట్ల రూపాయలు. డ్యామేజీలు, సీపేజీలు. గతంలో చేసిన పనులన్నీ గోదావరి పాలు. ఇదీ పోలవరానికి వైఎస్సార్సీపీ చేసిన నష్టాలు. కూటమి సర్కార్ రాకతో కథ మొత్తం మారిపోయింది. ఐదేళ్లూ అంధకారంలో ఉన్న ప్రాజెక్టుకు ఇప్పుడు సరికొత్త వెలుగులొచ్చాయ్. సీఎం వ్యూహాలు ఫలించాయ్. నిపుణుల సలహాలు తోడయ్యాయ్. పనులు పరుగులు పెడుతున్నాయ్. మొత్తంగా రెండేళ్లలో - మిగతా3లో



## ఐక్యంగా ఉండి ప్రజలను సంఘటితం చేస్తాం

- 2029 లోక్‌సభ ఎన్నికల్లో 'ఇండి' కూటమి ఆల్రెడీ గెలిచేసింది
- 2029 ఎన్నికలపై రాహుల్ గాంధీ కీలక వ్యాఖ్యలు
- ఇండి కూటమిలో లోక్‌సభ ప్రతిపక్షనేత స్పీచ్
- పోటీలో గెలవడానికి నిష్పక్షపాతమైన ఎన్నికలే లేవని వ్యాఖ్యలు!
- అలాగే బీజేపీని, అది భారతదేశ వ్యవస్థలను తన గుప్పిట్లోకి తీసుకోవడంపై మేం ప్రతిఘటిస్తాం"

## తుని బాలిక అదృశ్యం ఘటనపై

# పవన్ కల్యాణ్ ఆరా



- ఆధారం అనుకున్న పెంపుడు కుక్క మృతి
- వారం రోజులు గడిచినా ఆచూకీ లభించకపోవడంతో తీవ్రత పెంచాలని ఆదేశం
- గాలింపు చర్యల్లో ఎన్డీఆర్ఎఫ్ బృందాల సేవలు వినియోగించుకోవాలని సూచన
- ఇప్పటికే 400 మంది సిబ్బందితో గాలిస్తున్నట్టు పవన్‌కు వివరించిన ఎస్పీ
- అటవీ నిపుణుల సాయంతో పరిసర ప్రాంతాల్లో విస్తృతంగా జల్లెడ పట్టాలని సలహా

**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అమరావతి**

కాకినాడ జిల్లా, తుని మండలం సీహెచ్ అగ్రహారంలో వారం రోజుల క్రితం అదృశ్యమైన బాలిక జ్ఞానేశ్వరి ఆచూకీని వీలైనంత వేగంగా కనుగొనాలని డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అధికారులను ఆదేశించారు. ఈ ఘటనపై ఆయన శనివారం కాకినాడ జిల్లా ఎస్పీతో ఫోన్‌లో మాట్లాడి, గాలింపు చర్యల పురోగతిని సమీక్షించారు. వారం రోజులు గడుస్తున్నా బాలిక ఆచూకీ లభించకపోవడంపై ఆందోళన వ్యక్తం చేసిన ఆయన, దర్యాప్తును మరింత ముమ్మరం చేయాలని స్పష్టం చేశారు. ఇప్పటికే ఈ విషయంపై ఆయన పలుమార్లు పోలీసు ఉన్నతాధికారులతో చర్చించారు. ప్రస్తుతం పోలీసు, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు నిర్వహిస్తున్న గాలింపు చర్యలకు అదనంగా మరిన్ని - మిగతా3లో



## ఆర్థిక, సాంస్కృతిక సంబంధాల బలోపేతమే లక్ష్యం

- ఫ్రాన్స్, స్లోవేకియా పర్యటనకు ప్రధాని మోదీ
- ఫ్రాన్స్, స్లోవేకియా దేశాలకు అధికారిక పర్యటనకు బయలుదేరిన ప్రధాని మోదీ
- ఆర్థిక, సాంకేతిక, సాంస్కృతిక సహకారాల విస్తరణపై ప్రధాన దృష్టి
- భారత్, ఫ్రాన్స్ స్పెషల్ గ్లోబల్ స్ట్రాటజిక్ పార్టనర్‌షిప్ సమీక్ష

## రెండేళ్లలోనే కూటమి ప్రభుత్వం విఫలం



- నిత్యావసర వస్తువుల ధరలు భారీగా పెరిగాయన్న బొత్స
- రైతులకు గిట్టుబాటు ధరలు లభించడం లేదని విమర్శ
- సూపర్ సిక్స్ పథకాలు ఏమయ్యాయని నిలదీత

**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అమరావతి**

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తికాకముందే అన్ని రంగాల్లో విఫలమైందని వైసీపీ శాసనమండలి పక్ష నేత బొత్స సత్యనారాయణ విమర్శించారు. ఈరోజు విశాఖపట్నంలో మీడియాతో మాట్లాడిన ఆయన, ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. నిత్యావసర వస్తువుల ధరలు భారీగా పెరగడంతో సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బొత్స పేర్కొన్నారు. రైతులకు తమ పంటలకు గిట్టుబాటు ధరలు లభించడం లేదని, జొన్న, మామిడి పంటలకు కూడా - మిగతా3లో

# మోడల్ కాలనీ పాఠశాలను పదో తరగతి వరకు అప్‌గ్రేడ్ చేయాలి

### స్థలం సిద్ధంగా ఉంది..భవనం నిర్మిస్తే చాలని స్థానికుల విజ్ఞప్తి



**కుప్పం, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, జూన్ 13:**
చిత్తూరు జిల్లా కుప్పం మున్సిపాలిటీ పరిధిలోని మోడల్ కాలనీలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను పదో తరగతి వరకు అప్‌గ్రేడ్ చేయాలని స్థానికులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ప్రస్తుతం ఒకటి నుంచి ఐదో తరగతి వరకు మాత్రమే బోధన జరుగుతున్న ఈ పాఠశాల పరిధిలో సుమారు రెండు వేల పేద, మధ్యతరగతి కుటుంబాలు నివసిస్తున్నాయని పేర్కొంటున్నారు. ఐదో తరగతి పూర్తయిన అనంతరం విద్యార్థులు మూడు నుంచి నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న పాఠశాలలకు వెళ్లాల్సిన పరిస్థితి ఉందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రవాణా సౌకర్యాల లేమి, ఆర్థిక ఇబ్బందుల కారణంగా పలువురు విద్యార్థులు చదువును మధ్యలోనే నిలిపివేస్తున్నారని తెలిపారు. ముఖ్యంగా బాలికల భద్రత విషయంలో తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నట్లు చెప్పారు. పాఠశాల విస్తరణకు అవసరమైన స్థలం ఇప్పటికే అందుబాటులో ఉందని, ప్రభుత్వం అదనపు తరగతి గదుల భవనాన్ని నిర్మించి ఉపాధ్యాయులను నియమిస్తే సరిపోతుందని కాలనీవాసులు పేర్కొన్నారు. దీంతో మోడల్ కాలనీతో పాటు సమీప ప్రాంతాల విద్యార్థులకు కూడా నాణ్యమైన విద్య అందుబాటులోకి వస్తుందని అభిప్రాయపడ్డారు. పేద కుటుంబాల పిల్లలు ఉన్నత విద్యను అభ్యసించేందుకు అవకాశం కల్పించాలంటే పాఠశాలను వెంటనే ఉన్నతీకరించడం అవసరమని స్థానిక మహిళా సంఘాల ప్రతినిధులు తెలిపారు. విద్య అందరికీ చేరువ కావాలన్న ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా ఈ పాఠశాలను పదో తరగతి వరకు విస్తరించాలని విజ్ఞప్తి చేశారు. పాఠశాల అప్‌గ్రేడ్ అయితే విద్యార్థుల చదువు మానివేతలు తగ్గడంతో పాటు మోడల్ కాలనీ, పరిసర కాలనీల విద్యార్థులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు. ఈ అంశంపై ప్రభుత్వం తక్షణమే స్పందించి అవసరమైన చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

# ఓటరు జాబితా సవరణ విజయవంతానికి సమన్వయంతో పనిచేయాలి

### శాంతిపురంలో బీఎల్‌ఏలు, బూత్ ఇంచార్జ్‌లకు మార్గదర్శక శిక్షణ
### ఏపీఎస్ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పి.ఎస్. మునిరత్నం



**శాంతిపురం, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, జూన్ 13:**
ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో అప్రమత్తంగా వ్యవహరిస్తూ ప్రతి అర్హుడి పేరు ఓటరు జాబితాలో నమోదయ్యేలా చర్యలు చేపట్టాలని ఏపీఎస్ఆర్టీసీ ఉపాధ్యక్షుడు పి.ఎస్. మునిరత్నం సూచించారు. చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గంలోని శాంతిపురం మండల పార్టీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక శిక్షణా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సంఘం చేపడుతున్న ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంపై క్లస్టర్–1 బీఎల్‌ఏలు, బూత్ ఇంచార్జ్‌లు, పార్టీ నాయకులు, కార్యకర్తలకు సమగ్ర అవగాహన కల్పించారు. ఓటరు జాబితా సవరణ, కొత్త ఓటర్ల నమోదు, చిరునామా మార్పులు, పేర్ల సవరణలు, తొలగింపుల ప్రక్రియలపై వివరంగా సూచనలు అందించారు. ప్రతి అర్హత కలిగిన పౌరుడు ఓటరుగా నమోదు కావడం ప్రజాస్వామ్య వ్యవస్థకు ఎంతో కీలకమని పేర్కొన్నారు. ఓటరు జాబితాలో ఎలాంటి పొరపాట్లు లేకుండా బీఎల్‌ఏలు, బూత్ ఇంచార్జ్‌లు ఇంటింటికీ వెళ్లి క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో, ప్రజా సమస్యలను గుర్తించి పరిష్కార మార్గాలు చూపడంలో కార్యకర్తల పాత్ర కీలకమని తెలిపారు. పార్టీ బలోపేతంతో పాటు ప్రజలకు మరింత చేరువయ్యేలా ప్రతి కార్యకర్త బాధ్యతాయుతంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. రానున్న రోజుల్లో ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అందరూ సమన్వయంతో పనిచేయాలని, ముఖ్యంగా కొత్త ఓటర్ల నమోదుపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో మండల నాయకులు, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు, బీఎల్‌ఏలు, బూత్ ఇంచార్జ్‌లు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులే ప్రజల విశ్వాసానికి పునాదిశెట్టిపల్లి–కంచిబందార్లపల్లి తారు రహదారి నిర్మాణం

### ప్రజలకు వరం ఏఎంసీ ఛైర్మన్ జి.ఎం. రాజు

**కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, జూన్ 13:**



శెట్టిపల్లి నుండి కంచి బందార్లపల్లి వరకు రూ.60 లక్షల వ్యయంతో తారు రోడ్డు నిర్మాణం చేపట్టడం అభివృద్ధికి నిదర్శనమని ఏఎంసీ చైర్మన్ జి.ఎం.రాజు పేర్కొన్నారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వం లో గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి పెద్దపీట వేస్తూ రహదారులు, మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఈ రహదారికి కనీసం ప్యాచ్‌వర్క్ కూడా చేయలేదన్న ఏఎంసి చైర్మన్ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొ న్నారని విమర్శించారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజల అవసరాలను గుర్తించి శెట్టిపల్లి – కంచిబందార్లపల్లి మార్గాన్ని నూతన తారు రహదారిగా అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. ప్రజలకు ఉపయోగపడే అభివృద్ధి కార్యక్రమాలే నిజ మైన రాజకీయాలుగా నిలుస్తాయని, అలాంటి పనులను ప్రజలు ఎప్పుడూ స్వాగతిస్తారని తెలిపారు. అభివృద్ధి పనులను పక్కనపెట్టి ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుపై విమర్శలు చేయడం వల్ల ప్రజల్లో ఆదరణ లభించదన్నారు. ప్రజ లు రాజకీయ పార్టీల పనితీరును ఎప్పటికప్పుడు గమనిస్తున్నారని, ఎవరు అభివృద్ధి చేస్తున్నా రు, ఎవరు అడ్డంకులు సృష్టిస్తున్నారు అన్న విషయాలను స్పష్టంగా అర్థం చేసుకుంటున్నా రని పేర్కొన్నారు. ప్రజల తీర్పే అంతిమమని, ప్రజాసంక్షేమం, అభివృద్ధి కోసం పనిచేసే నాయకులనే ప్రజలు ఆదరిస్తారని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టి ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపర్చేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన తెలిపారు.

# ఉద్యోగుల బకాయిలు వెంటనే చెల్లించాలి

### 12వ పీఆర్సీ అమలులో జాప్యం ఎందుకు?
### తిరుపతి విజయోత్సవ సభల కంటే ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రాధాన్యం ఇవ్వాలి
### ప్రెస్ క్లబ్‌లో మాజీ కేంద్ర మంత్రి చింతామోహన్ విమర్శలు




**కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, జూన్ 13:**
రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు వెంటనే 12వ వేతన సవరణ సంఘం (పీఆర్సీ) అమలు చేయడంతో పాటు పెండింగ్‌లో ఉన్న బకాయిలను చెల్లించాలని మాజీ కేంద్ర మంత్రి చింతా మోహన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కుప్పం పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో శనివారం నిర్వహించిన పాత్రికేయుల సమావేశం లో ఆయన మాట్లాడారు. ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించాలి రాష్ట్రంలో లక్షలాది మంది ప్రభుత్వ ఉద్యోగులు జీతాల బకాయిలు, డీఏ బకాయిలు, పీఆర్సీ అమలు కోసం ఎదురుచూస్తున్నారని చింతామోహన్ అన్నారు. సుమారు రూ.30 వేల కోట్ల మేర ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలు ఉన్నాయని పేర్కొన్నారు. ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, ఆలస్యం చేయకుండా 12వ పీఆర్సీని ప్రకటించాలని కోరారు. విజయోత్సవ సభలపై విమర్శలు ఇటీవల తిరుపతిలో నిర్వహించిన కూటమి ప్రభుత్వ విజయోత్సవ సభను ప్రస్తావిస్తూ చింతా మోహన్ విమర్శలు చేశారు. సభలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎక్కువ సమయం ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ప్రశంసించడానికే కేటాయించారని ఆరోపించారు. ప్రజల సమస్యలు, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, ఉద్యోగుల ఇబ్బందులపై మాట్లాడాల్సిన సమయంలో రాజకీయ ప్రసంగాలకే ప్రాధాన్యం ఇచ్చారని వ్యాఖ్యానించారు. దేశ అభివృద్ధికి కాంగ్రెస్ కృషి దేశ అభివృద్ధిలో కాంగ్రెస్ పార్టీ కీలక పాత్ర పోషించిందని చింతామోహన్ పేర్కొన్నారు. మధ్యాహ్న భోజన పథకం, ఆహార భద్రత చట్టం, సమాచార హక్కు చట్టం వంటి పలు సంక్షేమ కార్యక్రమాలు కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలో అమల్లోకి వచ్చాయని తెలిపారు. మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ తీసుకొచ్చిన ఆర్థిక సంస్కరణల వల్లే భారత ఆర్థిక వ్యవస్థ బలోపేతమైందని అన్నారు. ధరల పెరుగుదలతో ప్రజలు ఇబ్బందులు గత 12 సంవత్సరాలుగా కేంద్రంలో అధికారంలో ఉన్న ప్రభుత్వం ప్రజల ఆర్థిక సమస్యలను పరిష్కరించడంలో విఫలమైందని ఆయన విమర్శించారు. నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోయాయని, సామాన్య ప్రజలపై జీవన భారం రోజురోజుకూ అధికమవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. దేశం ఆర్థిక సవాళ్లను ఎదుర్కొంటోందని పేర్కొన్నారు. రాజకీయ ఆరోపణలతో ప్రజలకు ప్రయోజనం లేదు రాష్ట్ర రాజకీయాల్లో ప్రస్తుతం పరస్పర విమర్శలు, ఆరోపణలు పెరిగిపోయాయని చింతామోహన్ అన్నారు. ఒకవైపు విజయోత్సవ సభలు నిర్వహిస్తుంటే మరోవైపు వెన్నుపోటు రాజకీయాల గురించి మాట్లాడుతున్నారని విమర్శించారు. ఇటువంటి రాజకీయ వాగ్వాదాల వల్ల ప్రజలకు ఎలాంటి ప్రయోజనం ఉండదని, పాలకులు ప్రజా సమస్యల పరిష్కారంపైనే దృష్టి పెట్టాలని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం కావాలి ప్రజలు ప్రభుత్వాలను ఎన్నుకునేది అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, సమస్యల పరిష్కారం కోసం మాత్రమే నని చింతామోహన్ అన్నారు. ఉద్యోగులు, రైతులు, యువత, సామాన్య ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడమే ప్రభుత్వాల ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు. రాష్ట్ర ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను వెంటనే నెరవేర్చాలని ఆయన మరోసారి ప్రభుత్వాన్ని కోరారు.

# కుప్పం పీఈఎస్ఐఎంఎస్ఆర్‌లో..డాక్టర్ల ప్రీమియర్ లీగ్ ప్రారంభం





**కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, జూన్ 13:**
చిత్తూరు జిల్లా కుప్పంలోని పీఈఎస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ (పీఈఎస్ఐఎంఎస్ఆర్)లో డాక్టర్ల ప్రీమియర్ లీగ్ (డీపీఎల్) – 14వ ఎడిషన్ కార్యక్రమాల సందర్భంగా శుక్రవారం వైద్య పరిశోధనలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పీఈఎస్ఐఎంఎస్ఆర్ డీన్, ప్రిన్సిపల్ డాక్టర్ హెచ్.ఆర్. కృష్ణ రావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉన్నత వైద్య సేవలతో పాటు పరిశోధనలకు కూడా వైద్యులు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. ఆధునికవైద్య రంగంలో కొత్త ఆవిష్కరణలు, చికిత్సా విధానాల అభివృద్ధికి పరిశోధనలు కీలకమని పేర్కొన్నారు. రోగులకు మరింత నాణ్యమైన సేవలు అందించాలంటే వైద్యులు నిరంతరం అధ్యయనం చేస్తూ పరిశోధనల్లో భాగస్వాములు కావాలని సూచించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న వైస్ ప్రిన్సిపల్ (అకాడెమిక్) డాక్టర్ టి. అనిల్ కుమార్ పరిశోధనా వ్యాసాల రచన, ప్రచురణ ప్రక్రియ, వైద్య విద్యార్థులు మరియు అధ్యాపకులు పరిశోధనల్లో పాటించాల్సిన ప్రమాణాలపై వివరించారు. అంతర్జాతీయ స్థాయి వైద్య జర్నల్లో పరిశోధనా పత్రాలు ప్రచురించేందుకు అవసరమైన మార్గదర్శకాలను వివరించారు. డాక్టర్ల ప్రీమియర్ లీగ్ (డీపీఎల్) – – 14వ ఎడిషన్‌లో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో వైద్యులు, అధ్యాపకులు, విభాగాధిపతులు, పీజీ విద్యార్థులు పాల్గొన్నారు. పరిశోధనల ద్వారా వైద్య రంగంలో కొత్త అవకాశాలు సృష్టించడంతో పాటు ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించవచ్చని నిపుణులు అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో వైద్య పరిశోధనల ప్రాముఖ్యత, పరిశోధనలో నైతిక ప్రమాణాలు, శాస్త్రీయ వ్యాసాల ప్రచురణ విధానం, పరిశోధన ఫలితాలను సమాజ ప్రయోజనాలకు వినియోగించే మార్గాలపై విస్తృతంగా చర్చించారు. చివరగా పాల్గొన్న వైద్యులు తమ సందేహాలను నిపుణులను అడిగి నివృత్తి చేసుకున్నారు.

# ఆరోపణలు రుజువు చేస్తే రాజకీయ సన్యాసం..




### లేకపోతే బేషరతుగా క్షమాపణ చెప్పాలి
### వైసీపీ నాయకులకు టీడీపీ బహిరంగ సవాల్..
### కుప్పానికి శాశ్వత ఎమ్మెల్యే చంద్రబాబేనని స్పష్టం

**కుప్పం, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, జూన్ 13:**
వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నిర్వహిస్తున్న "వెన్నుపోటుకు రెండేళ్లు"కార్యక్రమం ప్రజలను తప్పుదోవ పట్టించే రాజకీయ ప్రచారమేనని తెలుగుదేశం పార్టీ నాయకులు విమర్శించారు. కుప్పం పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు కాణిపాకం వెంకటేష్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో వైసీపీ నాయకులు చేస్తున్న ఆరోపణలకు టీడీపీ నేతలు ఘాటుగా స్పందించారు. సమావేశంలో ఏపీఎస్ఆర్టీసీ ఉపాధ్యక్షుడు పి.ఎస్. మునిరత్నం,పీకేఎం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ డాక్టర్ సురేష్ బాబు, టీటీడీ పాలక మండలి సభ్యుడు శాంతారామ్, రెస్కో చైర్మన్ ప్రతాప్,కార్పొరేషన్ డైరెక్టర్లు ప్రేమ్‌కుమార్, డాక్టర్ సుధీర్ ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో రాష్ట్ర అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేస్తూ ప్రజల విశ్వాసాన్ని చూరగొంటోందన్నారు. ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలు చేపడుతుండగా వాటిని ఓర్వలేక వైసీపీ నాయకులు నిరాధార విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు.హంద్రీ––నీవా ప్రాజెక్టు ద్వారా కుప్పం ప్రాంతానికి సాగు, తాగునీరు అందించడం చంద్రబాబు నాయుడు దూరదృష్టి ఫలితమని పేర్కొన్నారు. దశాబ్దాలుగా ఎదురుచూసిన నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిన నాయకుడిని విమర్శించడం ప్రజల అభిప్రాయాలను అవమానించడమేనన్నారు. అభివృద్ధి అంశాలపై చర్చించేందుకు తాము సిద్ధం గా ఉన్నామని, వాస్తవాల ఆధారంగా బహిరంగ చర్చకు రావాలని వైసీపీ నాయకులకు సవాల్ విసిరారు.వైసీపీ పాలన లో ప్రతిపక్ష కార్యక్రమాలకు అడ్డంకులు సృష్టించి, ప్రజాస్వామ్య విలువలను దెబ్బతీసిన నాయకులు ఇప్పుడు ప్రజాస్వామ్యం గురించి మాట్లాడటం ఆశ్చర్యకరమని వ్యాఖ్యానించారు. వెన్నుపోటు గురించి మాట్లాడే నైతిక హక్కు వైసీపీ నాయకులకు లేదన్నారు. ప్రభుత్వంపై చేస్తున్న అవినీతి ఆరోపణలను నిరూపిస్తే రాజకీయ సన్యాసం తీసుకునేందుకు సిద్ధంగా ఉన్నామని టీడీపీ నాయకులు స్పష్టం చేశారు. ఆరోపణలు చేసే వారు ఆధారాలను ప్రజల ముందుంచాలని, లేకపోతే బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఆధారాలు లేకుండా వ్యక్తిగత దూషణలు, రాజకీయ ఆరోపణలు చేయడం మానుకోవాలని సూచించారు. పీకేఎం అర్బన్ డెవలప్ మెంట్ అథారిటీ చైర్మన్ డాక్టర్ సురేష్ బాబు మాట్లాడుతూ. .కుప్పం అభివృద్ధికి చంద్రబాబు నాయుడు చేసిన సేవలు చరిత్రలో నిలిచిపోతాయని అన్నారు. కుప్పానికి శాశ్వత శాసన సభ్యుడు చంద్ర బాబేనని,ప్రజల హృదయాల్లో ఆయనకు ప్రత్యేక స్థానం ఉందని పేర్కొన్నారు. చంద్రబాబును రాజకీయంగా ఓడించే నాయకుడు ఇప్పటివరకు లేడని, భవిష్యత్తులో కూడా ఉండరని ధీమా వ్యక్తం చేశారు. డాక్టర్ సుధీర్ మాట్లాడుతూ.. వైసీపీ ప్రభుత్వ హయాంలో చెప్పుకోదగ్గ అభివృద్ధి జరగలేదన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను చూసి ఓర్వలేక వైసీపీ నాయకులు విమర్శలకు దిగుతున్నారని ఆరోపించారు. ప్రజల సమస్యల పరిష్కారమే తమ లక్ష్యమని, రాజకీయ విమర్శల కంటే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలుపైనే తమ దృష్టి కేంద్రీకృతమైందన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పారదర్శక పాలన అందిస్తోందని, ప్రజలు కూడా ప్రభుత్వ పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని నాయకులు తెలిపారు. ప్రజలను తప్పుదోవ పట్టించే రాజకీయాలకు కాలం చెల్లిపోయిందని, అసత్య ప్రచారాలను ప్రజలు నమ్మరని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గాజుల గోపీనాథ్, సత్యేంద్ర శేఖర్, సోమశేఖర్, విశ్వనాథ్, చెక్కునత్తం మణి, బాబునాయుడు, తిరుమగళ్, కన్నన్, అనసూయ, వసంతమ్మ, సుగుణమ్మ, తదితరులు పాల్గొన్నారు.రానున్న రోజుల్లో ప్రజలే వైసీపీ నాయకులకు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.





చిత్తూరు ఎక్స్‌ప్రెస్
జాతీయ తెలుగు దినపత్రిక
APTEL/2024/86143



# రెండేళ్లలో మారిన పోలవరం రూపురేఖలు

-మొదటిపేజీ తరువాయి

రూపురేఖలు మారిపోయాయ్. లక్ష్యం దిశగా వేగంగా అడుగులు పడుతున్నాయ్. ఏడాదిలోగా ఈ మహాయజ్ఞం పూర్తి కావాలంటే ఏం చేయాలి? సర్కార్ ముందున్న సవాళ్లేంటి? అనేది ఇప్పుడు చూద్దాం. పోలవరం ప్రాజెక్టు ఆంధ్రప్రదేశ్‌కు జీవనాడి. వైఎస్సార్సీపీ రివర్స్ గేర్‌తో వినాశనానికి గురైన ఈ ప్రాజెక్టు ప్రస్తుతం సంక్షోభాల చీకట్లను చీల్చుకుంటూ సరికొత్త వెలుగులతో సాకారం దిశగా అడుగులు వేస్తోంది. డయాఫ్రం వాల్‌ను కేవలం 14 నెలల్లోనే రికార్డు సమయంలో నిర్మించి అసాధ్యాన్ని సుసాధ్యం చేశారు. ప్రధాన డ్యాం వద్ద అగాథాలు పూడ్చివేశారు.

2027 మహా పుష్కరాల కంటే ముందే ఈ మహా యజ్ఞాన్ని పూర్తి చేసి జాతికి అంకితం ఇవ్వాలనే సంకల్పంతో పనులు చేస్తున్నారు. అయితే అసలు పోలవరం ఇంత ఆలస్యం కావడానికి కారణాలేంటి? వైఎస్సార్సీపీ చేసిన పాపమేంటి? కూటమి సర్కార్ సాధించిన విజయాలేంటి? భవిష్యత్తులో చేయాల్సిన పనులేంటి? అనే వాటిపై సమగ్ర విశ్లేషణ ఇది.

### అగాథాలు సాంకేతికతతో పూడ్చివేత

డయాఫ్రం వాల్ డ్యామేజ్ ప్రధాన డ్యాం వద్ద సీపేజ్ ఇదీ వైఎస్సార్సీపీ మార్క్ వినాశనం రెండేళ్ల క్రితం అంటే 2024 జూన్‌లో పోలవరం పరిస్థితి మహా దారుణం. గత జగన్ సర్కార్ నిర్లక్ష్యం వల్ల ప్రాజెక్టుకు గుండె లాంటి డయాఫ్రం వాల్ తీవ్రంగా ధ్వంసమైంది. 2020లోనే ఈ కట్టడం దెబ్బతిన్నా ఏడాది పాటు దాన్ని గుర్తించలేని చేతకానితనంలో నాటి ప్రభుత్వం, పాలకులు ఉన్నారు. దీనికి తోడు ప్రధాన డ్యాం నిర్మించాల్సిన చోట గోదావరిని తలపించేలా సీపేజీ సమస్య ముంచెత్తింది. దీంతో భారీ అగాథాలు ఏర్పడ్డాయి. ఎడమ కాలువ పనులు ఐదేళ్లలో ఒక్క శాతం కూడా ముందుకు కదల్లేదు. పునరావసం అస్సలు పట్టించుకోలేదు. ఇలా పోలవరం పాలిట శాపంగా మారింది వైఎస్సార్సీపీ పాలన.

### కేవలం 14 నెలల్లోనే కొత్త డి-వాల్ పూర్తి

జెట్ స్పీడ్‌లో పనులు రెండేళ్లలో మారిన రూపురేఖలు ఇదీ కూటమి సర్కార్ కమిట్‌మెంట్ కూటమి ప్రభుత్వం రాగానే పోలవరానికి పట్టిన గ్రహణాన్ని వీడగొట్టింది. కేంద్ర జలశక్తి శాఖ, పోలవరం అథారిటీలతో సమన్వయం చేసుకుంటూ అంతర్జాతీయ విదేశీ నిపుణుల బృందాన్ని రంగంలోకి దించింది. విదేశీ నిపుణులు ఏడుసార్లు ప్రాజెక్టును సందర్శించారు. గత ప్రభుత్వం ధ్వంసం చేసిన పాత డయాఫ్రం వాల్ స్థానంలో కూటమి సర్కార్ కేవలం 14 నెలల్లోనే కొత్త డి-వాల్ పూర్తి చేసింది.

365 ప్యానెళ్లు, 13 వందల 72.60 మీటర్ల పొడవునా ఈ పటిష్టమైన వాల్ నిర్మించారు. ఎగువ కాఫర్ డ్యాం నుంచి వచ్చే సీపేజీని అరికట్టేందుకు విదేశీ నిపుణుల సూచనలతో



బట్రస్ డ్యాంను నిర్మించారు. ప్రధాన డ్యాం ప్రాంతాల్లో ఏర్పడిన అగాథాలను వైబ్రో కాంపాక్షన్ సాంకేతికతతో విజయవంతంగా పూడ్చివేసి నేలను పటిష్టం చేశారు. డ్యాం గ్యాప్ -3 కాంక్రీటు నిర్మాణాన్ని పూర్తి చేయడంతో పాటు ఎత్తు పెంచే పనులను వేగవంతం చేశారు. మొత్తం 53.32 మీటర్ల ఎత్తుకు నిర్మించాల్సి ఉండగా గ్యాప్ -1 ఇప్పటికే 33 మీటర్లు, గ్యాప్ -2 ను 20 మీటర్ల ఎత్తుకు నిర్మించారు.

### 80 శాతానికి పైగా పనులు పూర్తి

గడచిన రెండేళ్లలోనే ప్రాజెక్టుపై 6 వేల 33 కోట్లు ఖర్చు చేశారు. గత వైఎస్సార్సీపీ సర్కార్ వదిలేసిన ఎడమ కాలువ పనులను పరుగులు పెట్టించి 80 శాతానికి పైగా పూర్తి చేశారు. అటు కుడి, ఎడమ కాలువ అనుసంధాన పనులు కూడా 90 శాతానికి చేరుకున్నాయి. పాత ప్రభుత్వంలో అటకెక్కిన పునరావాస పనులను చురుగ్గా చేపట్టారు. కేవలం రెండేళ్లలోనే నిర్వాసితుల కోసం 2 వేల 237 కోట్లు చెల్లించారు. గతంలో పనులు ఆపేసిన గుత్తదారులకు కొత్త ధరలకు టెండర్లు కేటాయించి నిర్వాసితుల కాలనీల నిర్మాణాన్ని యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తున్నారు.

### లక్ష్యం సాధించాలంటే ఏడాదిలో ఏం చేయాలి?

2027 జూన్ నాటికి మొత్తం డ్యాం ०53.32 మీటర్ల ఎత్తుతో పూర్తి చేయాలనేది కూటమి ప్రభుత్వ లక్ష్యం. గ్యాప్-1 పొడవు 584 మీటర్లు. 33 మీటర్ల ఎత్తువరకు దీని నిర్మాణం పూర్తయింది. గ్యాప్-2 ప్రధాన డ్యాం 1,750 మీటర్లు. ఇది 20 మీటర్ల ఎత్తు వరకు పూర్తయింది. నిర్మాణంలో ప్రతి లేయర్‌లో నాణ్యత పరీక్షలు నిర్వహిస్తూ పూర్తి చేయాలి. ఆరు నెలలకు అవసరమైన మెటీరియల్ సిద్ధంగా ఉంది. జనవరి నుంచి అవసరమైన మెటీరియల్ సేకరిస్తున్నారు. పనుల వేగం పెంచాలి. వారం వారం లక్ష్యం కచ్చితంగా అమలయ్యేలా జాగ్రత్తలు తీసుకోవాలి.

పునరావాసంలో మొత్తం 38 వేల 060 కుటుంబాలను తరలించాలి. ఇంతవరకు 17 వేల 261 కుటుంబాలు తరలించారు. మరో 20 వేల 799 కుటుంబాలను తరలించాల్సి ఉంది. ఇందుకు 4 వేల 395 కోట్లు కావాలి. కాలనీలు నిర్మించాలి. 6 వేల 950 ఎకరాలు సేకరించి ఇవ్వాలి. సకాలంలో ఇవి పూర్తి చేయాలంటే ఇంకా వేగం పెంచాల్సి ఉంది. వైఎస్సార్సీపీ సర్కార్‌లో ధ్వంసమైన గైడ్‌బండ్ పునర్నిర్మాణంపై దృష్టి పెట్టాలి. స్పిల్ వే వైపు వచ్చే ప్రవాహం వల్ల సుడిగుండాలు ఏర్పడకుండా ఇది రక్షణగా నిలుస్తుంది.

అప్రోచ్ ఛానల్‌లో ఇంకా 38.5 లక్షల క్యూబిక్ మీటర్లకు పైగా మట్టి తొలగించాల్సిన పనులు మొదలు పెట్టాలి. డి వాల్ నిర్మాణం సందర్భంగా ప్యానళ్లు నదీగర్భంలో దింపే విషయంలో మొదట్లో కొన్ని సమస్యలు తలెత్తినా అవి పరిష్కారమైనట్లు విదేశీ నిపుణులు ప్రకటించారు. డి వాల్‌లో బ్లీడింగ్ కనిపించిన ప్యానళ్ల మధ్య సంబంధంపై గుత్తేదారు కంపెనీ నుంచి నివేదిక తీసుకోవాలని సిఫార్సు చేశారు. అన్ని ప్యానళ్ల నిలువు, భ్రమణం కొలవడానికి బావర్ నివేదికల్లో ఉన్న త్రీడీ డేటాను సమీక్షించాలన్నారు. లోపాలు ఏమైనా ఉంటే సరిదిద్దుకోవాలని విదేశీ నిపుణులు సూచించారు.

డి వాల్ పైభాగాన్ని కొంత మేర తొలగించి ప్రధాన డ్యాం నిర్మించాలి. పోలవరం అధికారులు డి వాల్‌ను 400 మీటర్ల మేర ०18.5 మీటర్ల వద్ద కోత పెట్టిన అంశం చర్చనీయాంశమైంది. విదేశీ నిపుణుల బృందం ०19 నుంచి కోత పెట్టి పనులు చేయాలని సిఫార్సు చేసింది.

## రెండేళ్లలోనే కూటమి ప్రభుత్వం విఫలం

-మొదటిపేజీ తరువాయి

కనీస మద్దతు ధర అందడం లేదని అన్నారు. ఆక్వా రంగం పూర్తిగా సంక్షోభంలో కూరుకుపోయిందని ఆరోపించారు. విద్యాశాఖను మంత్రి నారా లోకేశ్‌కు అభివృద్ధి కోసం అప్పగించారా లేక దాన్ని నిర్వీర్యం చేయడానికా అని ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో ప్రకటించిన సూపర్ సిక్స్, సూపర్ సెవన్ హామీలు ఏమయ్యాయని నిలదీశారు. ఆడబిడ్డ నిధి పథకాన్ని ప్రభుత్వం దాదాపు పక్కన పెట్టిందని విమర్శించారు. ఇటీవల తిరుపతిలో నిర్వహించిన సభను విజయోత్సవ సభగా కాకుండా 'వెన్నుపోటు ఉత్సవం'గా అభివర్ణించిన బొత్స, టీడీపీని 'వెన్నుపోటు పార్టీ'గా పేర్కొన్నారు. రైతులు యూరియా కోసం ఒడిశా నుంచి ఒక్కో బస్తా రూ.600 చొప్పున కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొందని ఆరోపించారు. ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చని ఈ ప్రభుత్వానికి ఒక్క నిమిషం కూడా అధికారంలో కొనసాగే హక్కు లేదని బొత్స వ్యాఖ్యానించారు. 'రెండేళ్ల వెన్నుపోటు' ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు.

## తుని బాలిక అదృశ్యం ఘటనపై పవన్ కల్యాణ్ ఆరా...

-మొదటిపేజీ తరువాయి

బృందాలను రంగంలోకి దించాలని పవన్ కళ్యాణ్ సూచించారు. ముఖ్యంగా, జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం (ఎన్డీఆర్ఎఫ్) సేవలను కూడా వినియోగించుకోవాలని ఆయన స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. బాలిక ఇంటి పరిసరాల్లో దట్టమైన అటవీ ప్రాంతం ఉన్నందున, ఆ ప్రాంతంలో విస్తృతంగా జల్లెడ పట్టాలని తెలిపారు. అడవుల్లో తిరగడంలో నైపుణ్యం ఉన్న నిపుణులు, ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ నైట్ వాచర్లు, బేస్ క్యాంప్ వాచర్ల సహాయం తీసుకోవడం ద్వారా గాలింపును మరింత ప్రభావవంతంగా మార్చాలని సలహా ఇచ్చారు. ఈ సందర్భంగా, జిల్లా ఎస్పీ చేపడుతున్న చర్యలను డిప్యూటీ సీఎంకు వివరించారు. బాలిక ఆచూకీ కోసం ఇప్పటికే 400 మందికి పైగా సిబ్బంది గాలింపు చర్యల్లో పాల్గొంటున్నారని తెలిపారు. అత్యాధునిక డ్రోన్ల సహాయంతో అణువణువూ గాలిస్తున్నామని, బాలిక ఇంటి చుట్టుపక్కల ఉన్న 38 సీసీ కెమెరాల ఫుటేజీని క్షుణ్ణంగా పరిశీలించామని ఆయన పవన్ కల్యాణ్‌కు తెలియజేశారు. డిప్యూటీ సీఎం ఆదేశాల నేపథ్యంలో గాలింపు చర్యలను మరింత విస్తృతం చేసి, అదనపు బలగాలను సమీకరించి, బాలికను సురక్షితంగా గుర్తించేందుకు అన్ని రకాల ప్రయత్నాలు చేస్తున్నామని ఎస్పీ పేర్కొన్నారు. ఉన్నత స్థాయి నుంచి వస్తున్న పర్యవేక్షణతో ఈ కేసు దర్యాప్తులో మరింత వేగం పుంజుకుంది.

### తుని చిన్నారి అదృశ్యం కేసులో ఆధారం అనుకున్న శునకం మృతి

చిన్నారి జ్ఞానేశ్వరి కేసులో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. బాలిక ఆచూకీ కనుగొనడంలో పోలీసులకు కీలక ఆధారంగా నిలుస్తుందని భావించిన కుటుంబం పెంపుడు కుక్క మరణించింది. దీంతో ఈ కేసు దర్యాప్తులో పెద్ద ఎదురుదెబ్బ తగిలినట్లయింది.

తుని మండలం దొండవాక పంచాయతీ పరిధిలోని సీహెచ్ అగ్రహారంలో నివసిస్తున్న సుంకర గణేష్, భవానీ దంపతుల కుమార్తె జ్ఞానేశ్వరి జూన్ 6వ తేదీన ఇంటి వద్ద ఆడుకుంటూ అదృశ్యమైన విషయం తెలిసిందే. పాపతో పాటు వారి పెంపుడు కుక్క కూడా కనిపించకుండా పోయింది. అయితే, కొన్ని రోజుల తర్వాత ఆ శునకం మాత్రమే తిరిగి ఇంటికి వచ్చింది. దీంతో బాలిక జాడ కోసం పోలీసులు ఆ కుక్కకు జీపీఎస్ ట్రాకర్ అమర్చి దాన్ని వదిలిపెట్టారు. జీపీఎస్ అమర్చిన తర్వాత ఆ శునకం సుమారు 80 నిమిషాల పాటు 8 కిలోమీటర్ల మేర సమీప పొలాలు, అటవీ ప్రాంతంలో తిరిగి, మళ్లీ ఇంటికి చేరుకుంది. కానీ, ఇంటికి వచ్చిన కొద్దిసేపటికే కుప్పకూలి ప్రాణాలు విడిచింది. రోజుల తరబడి ఆహారం తీసుకోకపోవడం వల్లే అలసటతో అది మరణించి ఉంటుందని భావిస్తున్నారు.

ఇప్పటికే పోలీసులు, ఎస్డీఆర్ఎఫ్, అటవీ శాఖ బృందాలు డ్రోన్ల సహాయంతో విస్తృతంగా గాలిస్తున్నప్పటికీ బాలిక ఆచూకీ లభించలేదు. ఇప్పుడు కీలక ఆధారం అనుకున్న శునకం కూడా మరణించడంతో ఈ కేసు మరింత మిస్టరీగా మారింది. పోలీసులు కిడ్నాప్ సహా ఇతర కోణాల్లో దర్యాప్తు ముమ్మరం చేశారు.

## అందరికీ నీతులు చెప్పే ప్రకాశ్ రాజ్ ఇలాంటి చర్యలకు పాల్పడడం విడ్డూరంగా ఉంది

ప్రముఖ నటుడు ప్రకాశ్ రాజ్‌పై ఆంధ్రప్రదేశ్ బీజేపీ ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. పవిత్ర పుణ్యక్షేత్రమైన 'ధర్మస్థల' పవిత్రతను దెబ్బతీసేందుకు ప్రకాశ్ రాజ్ ప్రయత్నించారని, ఇదొక దిగ్భ్రాంతికరమైన, అవమానకరమైన చర్య అని ఆయన తీవ్రంగా విమర్శించారు. ఈ మేరకు ఆయన తన అభిప్రాయాలను వెల్లడించారు.

ధర్మస్థలానికి వ్యతిరేకంగా తప్పుడు ప్రచారం చేసేందుకు నటుడు ప్రకాశ్ రాజ్ కేరళ నుంచి ఏకంగా రూ.200 కోట్లు ఖర్చు చేశారని 'చిన్నయ్య' అనే వ్యక్తి ఆరోపించిన విషయాన్ని విష్ణువర్ధన్ రెడ్డి ప్రస్తావించారు. తరచూ ఇతరులకు నైతికత, ప్రజాస్వామ్యం గురించి ఉపన్యాసాలు ఇచ్చే ప్రకాశ్ రాజ్ ఇలాంటి చర్యలకు పాల్పడటం విడ్డూరంగా ఉందన్నారు. ఈ వ్యవహారంలో నిజానిజాలు కచ్చితంగా బయటకు రావాలని ఆయన డిమాండ్ చేశారు. ఒకవేళ ఆరోపణలు రుజువైతే, ప్రకాశ్ రాజ్ ఎంత పెద్ద నటుడైనా సరే చట్టం నుంచి తప్పించుకోలేరని స్పష్టం చేశారు. సెలబ్రిటీ హోదా అనేది చట్టపరమైన చర్యల నుంచి రక్షణ కవచం కాకూడదని ఆయన వ్యాఖ్యానించారు. ఈ ఆరోపణల నేపథ్యంలో పూర్తిస్థాయి విచారణ జరిపి వాస్తవాలను నిగ్గు తేల్చాలని విష్ణువర్ధన్ రెడ్డి కోరారు.

## దేవినేని, వంగవీటి కు కలిసి రాని కాలం

**విజయవాడ :** విజయవాడలో ఒకప్పుడు దేవినేని కుటుంబం రాజకీయాలకు పెట్టింది పేరు. దేవినేని రాజశేఖర్ జీవించి ఉన్న సమయంలో ఆయన నగర రాజకీయాలను తన గుప్పిట్లో పెట్టుకునేవారు. ఆయన ఏ పార్టీలో ఉన్నప్పటికీ బెజవాడలో ఆయనదే పై చేయి అయ్యేది. కొన్ని దశాబ్దాల కాలం పాటు దేవినేని కుటుంబం బెజవాడ రాజకీయాలను శాసించిందనే చెప్పాలి. కానీ దేవినేని నెహ్రూ మరణించిన తర్వాత మాత్రం ఆ కుటుంబానికి రాజకీయంగా కలసి రావడం లేదు. ఆయన కుమారుడు దేవినేని అవినాష్ ఎన్నిసార్లు పోటీ చేసినా ఇప్పటి వరకూ ఎన్నికల్లో విజయం సాధించలేదు. నెహ్రూ కు గెలుపులు పలకరిస్తే అవినాష్ ను ఓటములు కౌగలించుకుంటున్నాయి. నిజానికి దేవినేని అవినాష్ తెలుగుదేశం పార్టీ, వైసీపీ అంటూ పార్టీలు మార్చారు. ఏ పార్టీలో ఉన్నప్పటికీ దేవినేని అవినాష్ కష్టపడతారన్న పేరుంది. నిత్యం ప్రజల్లో ఉండేందుకే ప్రయత్నిస్తారంటారు. కానీ ఆయనకు పొలిటికల్ గా లక్కు కలసి రావడం లేదు. తన తండ్రి నెహ్రూ జీవించి ఉన్న సమయంలో కాంగ్రెస్ అభ్యర్థిగా విజయవాడ ఎంపీగా పోటీ చేసి ఓటమి పాలయ్యారు. ఆ తర్వాత దేవినేని అవినాష్ టీడీపీలో చేరారు. 2019 ఎన్నికల్లో గుడివాడలో టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి పాలయ్యారు. అనంతరం తిరిగి వైసీపీలోకి మారారు. 2024 ఎన్నికల్లో విజయవాడ తూర్పు నియోజకవర్గం నుంచి పోటీ చేసి మరోసారి అపజయాన్ని మూటగట్టుకున్నారు. దేవినేని అవినాష్ ఈసారి కూడా నియోజకవర్గం మార్చబోతున్నారు. దేవినేని నెహ్రూ కుమారుడిగా రాజకీయాల్లోకి వచ్చిన దేవినేని అవినాష్ ఇప్పటి వరకూ చట్టసభల్లో అడుగు పెట్టలేదు. దీంతో తన తండ్రి గతంలో ప్రాతినిధ్యం వహించిన కంకిపాడు (అప్పట్లో) నియోజకవర్గం, ఇప్పుడు పెనమలూరు నియోజకవర్గంపై ఆయన దృష్టి పెట్టినట్లు తెలిసింది. తూర్పు నియోజకవర్గం కంటే తనకు పెనమలూరు నియోజకవర్గం బెటర్ అని దేవినేని అవినాష్ భావిస్తున్నారు. పెనమలూరు అయితే తన గెలుపు గ్యారంటీ అన్న నమ్మకంతో ఉన్నా? పెనమలూరు నియోజకవర్గం నుంచి పోటీ చేసేలా ప్రణాళికలను సిద్ధం చేసుకుంటున్నారు. తన తండ్రి దేవినేని నెహ్రూ గతంలో కంకిపాడు నియోజకవర్గం నుంచి పోటీ చేయడంతో అక్కడ తనకు బలమైన ఓటు బ్యాంకు ఉందనినమ్ముతున్నారు. మరి ఈసారైనా గెలుపు దేవినేని అవినాష్ ను పలకరిస్తుందా? లేదా? అన్నది చూడాలి.

బెజవాడ రాజకీయాలను వంగవీటి కుటుంబాన్ని వేరు చేసి చూడలేం. వంగవీటి రంగాకు ఇప్పటికీ విజయవాడ నగరంలో అభిమానులు, ప్రత్యేక అభిమానులు ఉన్నారు. కానీ ఆయన మరణానంతరం మాత్రం వంగవీటి కుటుంబానికి రాజకీయాలు అచ్చిరావడం లేదు. రంగా లెగసీని వారసులు అందిపుచ్చుకోలేకపోతున్నారు. ఒకరకంగా రంగా అభిమానులకు ఆవేదన కలిగించే విషయం. వంగవీటి రంగా హత్య తర్వాత ఆ కుటుంబంలో ఎవరికీ రాజకీయాలు పెద్దగా కలసి వచ్చినట్లు కన్పించడం లేదు. ఒకసారి రంగా సతీమణి రత్నకుమారి, మరొకసారి కుమారుడు వంగవీటి రాధా ఎమ్మెల్యేగా గెలవడం తప్పించి తర్వాత గెలుపు దక్కలేదు. ఎన్ని పార్టీలు మారి ప్రయత్నించినా ఫలితం కనిపించలేదు. దశాబ్దాల కాలం నుంచి రాజకీయ పదవులకు వంగవీటి కుటుంబం దూరంగానే ఉంటుంది. 2019 ఎన్నికలకు ముందు వైసీపీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరిన వంగవీటి రాధాకు నాడు టిక్కెట్ కూడా దొరకలేదు.

# ఉత్తరాంధ్రలో లోకేష్ టీమ్

**విజయనగర :** ఏపీ రాజకీయాల్లో ఉత్తరాంధ్ర కీలకం. ఉత్తరాంధ్రలో ఏ పార్టీ మెజారిటీ సీట్లు దక్కించుకుంటే అదే పార్టీ అధికారంలోకి రాగలదు. ప్రధానంగా ఉత్తరాంధ్రలో బిసి వర్గాలు అధికం. మత్స్యకారులు కూడా ఉన్నారు. గిరిజనులు కూడా నివసిస్తున్నారు. అయితే ప్రతి రాజకీయ పార్టీ ఉత్తరాంధ్రను ప్రతిష్టాత్మకంగా తీసుకుంటుంది. ఇప్పుడు తెలుగుదేశం పార్టీ కూడా అదే పనిలో ఉంది. ఉత్తరాంధ్రలో యువనాయకత్వానికి ప్రోత్సాహం అందించడం ద్వారా.. వచ్చే ఎన్నికల్లో మెజారిటీ సీట్లు సాధించాలని చూస్తోంది. ఆపై తెలుగుదేశం పార్టీని మరింత బలోపేతం చేసి.. మరో నాలుగు దశాబ్దాల పాటు అవసరమైన నాయకత్వాన్ని అందించాలని భావిస్తోంది. అందులో భాగమే చింతకాయల విజయ్ కు రాజ్యసభ పదవి. ఒక్క మాటలో చెప్పాలంటే లోకేష్ టీం ఉత్తరాంధ్రలో రంగంలోకి దిగిందన్నమాట. 2024 ఎన్నికల తరువాత తీసుకున్న నిర్ణయాలు చూస్తే టిడిపి యువతకు పెద్దపీట వేసినట్టేకచ్చితంగా తెలుగుదేశం పార్టీలో యువనేతల్లో లోకేష్ తర్వాత ఎవరు? అంటే ముందుగా గుర్తొచ్చేది కింజరాపు రామ్మోహన్ నాయుడు. పార్టీలో కూడా విపరీతమైన ఇమేజ్ సొంతం చేసుకున్నారు రామ్మోహన్ నాయుడు. కేవలం యువనేతలను ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో శ్రీకాకుళం పార్లమెంటు స్థానం నుంచి మూడోసారి గెలిచిన రామ్మోహన్ నాయుడుకు కేంద్ర మంత్రివర్గంలో చోటు కల్పించారు. కీలకమైన పౌర విమానయాన శాఖను అందించారు. మరోవైపు మొన్నటి ఎన్నికల్లో గజపతినగరం నుంచి యువకుడైన కొండపల్లి శ్రీనివాస్ కు అవకాశం ఇచ్చారు. రాష్ట్ర మంత్రివర్గంలోకి తీసుకున్నారు. ఇప్పుడు ఉమ్మడి విశాఖ జిల్లా నుంచి చింతకాయల విజయ్ ను రాజ్యసభకు పంపించారు. ఉత్తరాంధ్రలో బలోపేతం కావడంతో పాటు టిడిపికి భవిష్యత్తు నాయకత్వం



అందించేందుకుగాను ఈ నిర్ణయాలు అన్నట్టు ఉన్నాయి. వీరు మాత్రమే కాదు దాదాపు నేతల వారసులందరికీ ఛాన్స్ అందించింది టిడిపిఉత్తరాంధ్రలో మొత్తం 34 అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. ఐదు వరకు పార్లమెంటు సీట్లు కూడా ఉన్నాయి. మొన్నటి ఎన్నికల్లో 32 అసెంబ్లీ సీట్లను కైవసం చేసుకుంది టిడిపి కూటమి. నాలుగు పార్లమెంటు స్థానాలను దక్కించుకుంది. అయితే ఇదే దూకుడు కొనసాగాలి అంటే యువనాయకత్వం రావాలి అన్న ఆలోచనలో టిడిపి ఉంది. అందుకే కింజరాపు రామ్మోహన్ నాయుడు, కొండపల్లి శ్రీనివాస్, చింతకాయల విజయ్ వంటివారికి ఎనలేని ప్రాధాన్యమిస్తోంది. పైగా వీరంతా లోకేష్ టీమ్ గా ముద్ర ఉంది. ఆముద్రను బలంగా చాటుకోవాలని భావిస్తోంది. గతంలో చంద్రబాబు నాయుడుకు వలయంగా ఉండేవారు కింజరాపు ఎర్రన్నాయుడు, కళా వెంకట్రావు, అయ్యన్నపాత్రుడు, అశోక్ గజపతిరాజు లాంటివారు. ఇప్పుడు వారు వారసులు రంగంలోకి వచ్చారు లోకేష్ కోసం. మొత్తానికైతే చాప కింద నీరులా లోకేష్ టీం విస్తరిస్తోంది ఉత్తరాంధ్రలో..

# మారిన నియోజకవర్గాల లెక్కేంటీ

**విజయవాడ :** గత ఎన్నికల సమయంలో కొందరు నాయకులు పోటీ చేసిన నియోజకవర్గాల్లో వారు ఓడిపోయారు. అయితే.. ఆ తర్వాత పలువురు నేతలు.. పార్టీ మారారు. అలాంటి నియోజకవర్గాల్లో ఇప్పటికీ వైసీపీ రాజకీయాలు ఒకదారికి రాకపోవడం గమనార్హం. ఆయా నియోజకవర్గాల్లో పరిస్థితిని సరిదిద్దాలన్న సూచనలు వస్తున్నా.. ఇప్పటికీ.. పార్టీ అధిష్టానం పట్టించుకోకపోవడం గమనార్హం. దీంతో ఇప్పుడు వాటి పరిస్థితి ఏంటనేది వైసీపీలో చర్చనీయాంశంగా మారింది. జగ్గయ్యపేట.. ఈ నియోజకవర్గంలో పోటీ చేసిన సామినేని ఉదయభాను.. గత ఎన్నికల తర్వాత జనసేన తీర్థం పుచ్చుకున్నారు. దీంతో ఇక్కడ వైసీపీ తరఫున పెద్దగా పట్టించుకునే నాయకులు కనిపించడం లేదు. ఇది పార్టీకి.. స్థానిక కేడర్‌కు కూడా ఇబ్బందిగానే మారింది. తూర్పుగోదావరి జిల్లా రాజోలు నియోజకవర్గం



నుంచి పోటీ చేసిన గొల్లపల్లి సూర్యారావు కూడా ఓడిపోయారు. ఆ తర్వాత ఆయన నియోజకవర్గాన్ని వదిలేశారు. ఇక్కడ కూడా పార్టీ ఇబ్బందులు పడుతోంది. గుంటూరు జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గంలో కూడా వైసీపీకి ఎదురు గాలి వీస్తోంది. మాజీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి.. మేకతోటి సుచరిత గత ఎన్నికల్లో తాడికొండ నుంచి పోటీ చేసి పరాజయం పాలయ్యారు. ఆ తర్వాత.. ఆమె.. తిరిగి ప్రత్తిపాడుకు వెళ్లిపోయారు. కానీ, దూకుడుగా వ్యవహరించలేక పోతున్నారన్న వాదన బలంగా వినిపిస్తోంది. పైగా.. ఆమె పార్టీ మార్పుపై కొన్నాళ్ల కిందటే చర్చ వచ్చినా.. మౌనంగా ఉన్నారు. ప్రస్తుతం పార్టీ కార్యక్రమాలకు కూడా దూరంగా ఉంటున్నారు. విజయవాడ సెంట్రల్‌లోనూ.. ఇదే పరిస్థితి నెలకొంది. గత ఎన్నికల్లో పశ్చిమ నియోజకవర్గం నుంచి వచ్చి ఇక్కడ చక్రం తిప్పిన అప్పటి మంత్రి వెల్లంపల్లి శ్రీనివాస్.. తిరిగి తన నియోజకవర్గానికి చేరిపోయారు. దీంతో సెంట్రల్ నియోజకవర్గంలో వైసీపీ టాక్ ఎక్కడా వినిపించడం లేదు. ఎవరూ ముందుకు రావడం లేదు. పార్టీ మాటే వినిపించడం లేదు. ఇలా పదుల సంఖ్యలో నియోజకవర్గాలు వైసీపీకి ఇబ్బందిగా ఉన్నాయి. దీంతో ఏదైనా చేయాలని.. నాయకులను నియమించాలని నేతలు కోరుతున్నారు.

## మాజీ ముఖ్యమంత్రిని కలిసిన
## ఎస్ఎస్సి సెల్ అధ్యక్షుడు పసల కృష్ణయ్య



**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, జూన్13:** శ్రీకాళహస్తి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్య మంత్రి వర్యులు వైయస్ జగన్మోహన్ రెడ్డిని తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో శ్రీకాళహస్తి ఎస్సీ సెల్ అధ్యక్షుడు పసల కృష్ణయ్య మర్యాదపూ ర్వకంగా ఆయనను కలవడం జరిగింది అనంతరం జగన్మోహన్ రెడ్డికి 2029 జరగనున్న సార్వత్రిక ఎలక్షన్లో శ్రీకాళహస్తి నుంచి మధుసూదన్ రెడ్డిని అత్యంత భారీ మెజార్టీతో గెలి పించి అసెంబ్లీకి పంపిస్తామని ఆయనకు తెలియజేశారు. అలాగే కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న మోసపూరిత వాగ్దానాలపై వివరించారు రానున్న రోజులలో పార్టీ కోసం మరింత కష్టపడి పనిచేస్తామని తెలియజేశారు.

## బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన పై
## బాలల సంఘం పిల్లలకు అవగాహన కార్యక్రమం



**శ్రీకాళహస్తి,చిత్తూరు ఎక్స్ ప్రెస్, జూన్13:** శ్రీకాళహస్తి ఎర్రమరెడ్డిపల్లి గ్రామంలో బాలల సంఘం పిల్లలకు ప్రగతి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బాల కార్మిక నిర్మూలన వ్యవస్థపై అవగాహన కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలల సంఘం పిల్లలను ఉద్దేశించి క్రమం తప్పక పాఠశాలకు రావాలని కనీసం 18 సంవత్సరాలు నిండే వరకు పాఠశాల కళాశాల విద్య పూర్తి చేయాలని భవిష్యత్తులో అభివృద్ధి సాధించాలంటే విద్య తప్పనిసరి అని తెలిపారు. బాల కార్మికులు ఏర్పడకపోతే సమాజం అభివృద్ధి వైపు నడుస్తుందని తెలిపారు. పిల్లలచే బాల కార్మిక వ్యవస్థలో ఏర్పడే కష్టనష్టాలు చదువుకుంటే భవిష్యత్తు అభివృద్ధి దశలో పయనిస్తారని లేకుంటే అన్ని సమస్యలు ఎదుర్కొంటారని తెలిపారు. బాలల సంఘం పిల్లలు బాల కార్మిక వ్యవస్థపై అనేక సందేహాలు సమస్యలు తెలుసుకుని నష్టాలు వస్తాయని చదువుకుంటే బంగారు భవిష్యత్తు మాదేనని వారు తెలిపారు చిన్నతనంలోనే విద్యకు దూరమైతే భవిష్యత్తు అంధకారమని వారు చార్టర్ రూపంలో బాల కార్మిక వ్యవస్థపై బాల హక్కులపై వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రగతి సంస్థ కో కన్వీనర్ రామచంద్ర , బాలల సంఘం పిల్లలు పాల్గొన్నారు.

## చవటగుంటలో మహాభారత ఉత్సవాలు వైభవంగా



**వెదురుకుప్పం, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, జూన్13:** చిత్తూరు జిల్లా వెదురుకుప్పం మండలం చవటగుంట గ్రామంలో నిర్వహిస్తున్న మహాభారతం 46వ వార్షికోత్సవ వేడుకలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఈ నెల 10వ తేదీ నుంచి 21వ తేదీ వరకు జరుగుతున్న ఉత్సవాల్లో భాగంగా ప్రతిరోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి హరికథా గానం నిర్వహిస్తున్నారు. ప్రముఖ హరికథా భాగవతారిణి గీతా వాణి బృందం మహాభారతంలోని ఘట్టాలను భక్తులకు ఆసక్తికరంగా, ఆధ్యాత్మిక సందేశాలతో కూడిన రీతిలో వివరిస్తూ హరికథను వినిపిస్తున్నారు. ప్రతిరోజూ పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై కథా గానాన్ని ఆస్వాదిస్తున్నారు. ఉత్సవాల సందర్భంగా ఆలయ ధర్మకర్తలు, ఆలయ కమిటీ చైర్మన్, కార్యనిర్వాహకులు, మాజీ ధర్మకర్తలు, మాజీ చైర్మన్లు, గ్రామ పెద్దలు, ఉభయ దాతలు, విరాళ దాతలు, మహిళలు భారీ సంఖ్యలో పాల్గొంటున్నారు. మహాభారత కథా గానం ద్వారా యువతలో భారతీయ సంస్కృతి, ఆధ్యాత్మిక విలువలు పెంపొందుతున్నాయని నిర్వాహకులు తెలిపారు. ఉత్సవాలు ముగిసే వరకు వివిధ ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు వెల్లడించారు. గ్రామ ప్రజల సహకారంతో మహాభారత వార్షికోత్సవాలను విజయవంతంగా నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు.

## స్మశాన వాటికల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి
### ఎమ్మెల్యే అమరనాథ్ రెడ్డికి స్థానికుల వినతి



**పలమనేరు, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, జూన్ 13:** పలమనేరు మున్సిపాలిటీ పరిధిలోని పాటపేట ఒడ్డివానికుంట, మదనపల్లి రోడ్డులో ఉన్న స్మశాన వాటికల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని స్థానికులు, వీరశైవ లింగాయత్ సంఘ నాయకులు ఎమ్మెల్యే అమరనాథ్ రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. శనివారం ఎమ్మెల్యే కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. స్మశాన వాటికల్లో ప్రహరీ గోడ, బోర్‌వెల్, నీటి ట్యాంకు,మరుగుదొడ్లు,నిత్యకర్మలు నిర్వహించేందుకు షెల్టర్ వంటి కనీస సౌకర్యాలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. అంత్యక్రియలు, నిత్యకర్మలు నిర్వహించే సమయంలో అవసరమైన వసతులు లేకపోవడంతో కుటుంబ సభ్యులు ఇబ్బందులు పడాల్సి వస్తోందని తెలిపారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని స్మశాన వాటికలను అభివృద్ధి చేయాలని, తక్షణమే అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని కోరారు. పట్టణ పరిధిలో జనాభా పెరుగుతున్న నేపథ్యంలో స్మశానవాటికల్లో సదుపాయాల కల్పన అత్యవసరమని పేర్కొన్నారు. వారి వినతిపై స్పందించిన ఎమ్మెల్యే అమరనాథ్ రెడ్డి స్మశాన వాటికల అభివృద్ధికి ప్రత్యేక నిధులు మంజూరు చేయించే దిశగా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. సంబంధిత అధికారులతో మాట్లాడి అవసరమైన పనులను త్వరితగతిన చేపట్టేలా చర్యలు తీసుకుంటానన్నారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా స్మశాన వాటికల్లో అన్ని వసతులు ఏర్పాటు చేయడం కోసం కృషి చేస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రమేష్, బాలాజీ, సురేష్, కృష్ణప్పతో పాటు వీరశైవ లింగాయత్ సంఘ నాయకులు సోమశేఖరయ్య, నాగ మంజునాథ్, చంద్రమౌళి, మేఘనాథ్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# కుప్పంలో గ్రానైట్ అక్రమ రవాణాపై ఉక్కుపాదం
### టమాటా మాటున గ్రానైట్ తరలింపు యత్నం భగ్నం.. రెండు లారీలు స్వాధీనం





**కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, జూన్ 13:** కుప్పం మండలంలో అక్రమ గ్రానైట్ రవాణాపై పోలీసులు ఉక్కుపాదం మోపారు. టమాటా లోడ్ల ముసుగులో అక్రమంగా గ్రానైట్ రాళ్లను తరలిస్తున్న రెండు లారీలను పోలీసులు స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. ఈ ఘటన స్థానికంగా సంచలనం రేపింది. పోలీసుల కథనం ప్రకారం,కుప్పం పరిసరప్రాంతాల నుంచి గ్రానైట్ రాళ్లను అక్రమంగా తరలిస్తున్నారనే విశ్వసనీయ సమాచారం అందడంతో డీఎస్పీ పార్థసారథి ఆదేశాల మేరకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో టమాటా లోడ్ల పేరుతో వెళ్తున్న రెండు లారీలను తనిఖీ చేయగా, వాటిలో అక్రమంగా గ్రానైట్ రాళ్లు తరలిస్తున్నట్లు గుర్తించారు. వెంటనే లారీలను అదుపులోకి తీసుకుని సంబంధిత పత్రాలను పరిశీలించారు. రవాణాకు అవసరమైన అనుమతులు, ధ్రువపత్రాలు సక్రమంగా లేకపోవడంతో రెండు వాహనాలను సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ వ్యవహారంలో సంబంధిత వ్యక్తుల పాత్రపై దర్యాప్తు కొనసాగుతున్నట్లు అధికారులు తెలిపారు. గ్రానైట్ రవాణా పేరుతో ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ పార్థసారథి హెచ్చరించారు. అక్రమ తవ్వకాలు, అక్రమ రవాణాను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. గ్రానైట్ రవాణాకు సంబంధించిన అన్ని నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, ఉల్లంఘనలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని తెలిపారు. అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రత్యేక నిఘా బృందాలు నిరంతరం తనిఖీలు నిర్వహిస్తున్నాయని, ప్రజలు కూడా అనుమానాస్పద కార్యకలాపాలపై సమాచారం అందించి సహకరించాలని పోలీసులు కోరారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు వెల్లడించారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికే మెగా గ్రీవెన్స్ ప్రజాదర్బార్



**శ్రీకాళహస్తి,చిత్తూరు ఎక్స్ ప్రెస్, జూన్ 13:** శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి వారి కార్యాలయం నందు ప్రజా దర్బార్ (గ్రీవెన్స్ శనివారం నిర్వహించారు . ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి మాట్లాడుతూ..శ్రీకాళహస్తి నియోజకవర్గ ప్రజల కష్టాలను తీర్చడం, అర్హులైన ప్రతి ఒక్కరికీ కూటమి ప్రభుత్వ సంక్షేమ ఫలాలను సకాలంలో అందించడమే మన ప్రధాన లక్ష్యం. అందులో భాగంగానే నా క్యాంప్ కార్యాలయం నందు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని వివిధ మండలాల నుండి, గ్రామాల నుండి పెద్ద ఎత్తున తరలివచ్చిన ప్రజలను స్వయంగా కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నాను. తాగునీరు, సాగునీరు, అంతర్గత రహదారులు, పెన్షన్లు, రేషన్ కార్డులు , స్థానిక సమస్యలపై ప్రజలు నా దృష్టికి తెచ్చిన వినతులను స్వీకరించి క్షుణ్ణంగా పరిశీలించారు. సమస్యల తీవ్రతను బట్టి అక్కడికక్కడే సంబంధిత శాఖల అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి ఆయా సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ఎటువంటి నిర్లక్ష్యాన్ని కూటమి ప్రభుత్వం సహించబోదని ఈ సందర్భంగా అధికారులకు స్పష్టం చేశారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియలో ప్రతి ఓటు కీలకం




**శాంతిపురం,చిత్తూరు ఎక్స్‌ప్రెస్, జూన్13:** ఎన్నికల సంఘం చేపడుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) -- ఓటరు జాబితా సమగ్ర సవరణ ప్రక్రియను విజయవంతం చేసేందుకు రాళ్లబుదుగూరు క్లస్టర్-2 తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో బీఎల్ఏలు, బూత్ ఇన్‌చార్జీలకు శిక్షణా తరగతులు నిర్వహించారు. శాంతిపురం మండలంలోని దిలీప్ కళ్యాణ మండపంలో జరిగిన ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు ముఖ్య అతిథిగా హాజరై కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్ఐఆర్ ప్రక్రియలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఫారాల నింపే విధానం, అవసరమైన పత్రాల ప్రాముఖ్యత, 2002 ఓటరు జాబితా మ్యాపింగ్, డూప్లికేట్ ఓట్ల తొలగింపు వంటి అంశాలపై సమగ్ర అవగాహన కల్పించారు. అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో నమోదు అయ్యేలా బీఎల్ఏలు, బూత్ ఇన్‌చార్జీలు క్షేత్రస్థాయిలో పనిచేయాలని సూచించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తోందని, రానున్న ఎన్నికల్లో విజయానికి ప్రతి ఓటు కీలకమని పేర్కొన్నారు. ఓటరు జాబితాలో ఒక్క అర్హుడి పేరు కూడా మిస్ కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పిలుపునిచ్చారు. బూత్ స్థాయి నుంచే పార్టీని మరింత బలోపేతం చేయాలని, కార్యకర్తలందరూ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జ్ పీవీ నాగరాజు, రెస్కో డైరెక్టర్ బసవరాజు, చలపతి, యూనిట్ ఇన్‌చార్జ్ ఆర్ఎస్ మణి, పార్టీ నాయకులు, పంచాయతీ అధ్యక్షులు, బీఎల్ఏలు, బూత్ ఇన్‌చార్జీలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మేకలవాని కాల్వ బ్రిడ్జి వద్ద కాలువ, రోడ్డు నిర్మాణానికి వినతి



**పీలేరు, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, జూన్ 13:** పీలేరు పట్టణ ప్రజలు ఎన్నాళ్లుగానో ఎదురుచూస్తున్న మేకలవాని కాల్వ మార్గంలోని రైల్వే బ్రిడ్జి కింద మురుగునీటి కాలువ, సిమెంట్ రోడ్డు నిర్మాణానికి అవసరమైన అనుమతులు మంజూరు చేయాలని దక్షిణ మధ్య రైల్వే అధికారులను కోరారు. రాజంపేట పార్లమెంట్ సభ్యుడు మిథున్ రెడ్డి సూచనల మేరకు రైల్వే డివిజన్ వినియోగదారుల సలహా సంఘం సభ్యుడు భరత్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో నాగరాజా ఉదయ్ కుమార్ బృందం కడప జిల్లా పర్యటనకు వచ్చిన దక్షిణ మధ్య రైల్వే ప్రధాన నిర్వాహక అధికారి సందీప్ మాథుర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అజంతా టాకీస్ రోడ్డు -- మేకలవాని కాల్వ మధ్య ఉన్న రైల్వే బ్రిడ్జి కారణంగా అక్కడ మురుగునీటి కాలువ నిర్మాణం చేపట్టలేకపోతున్నామని వివరిం చారు. దీంతో మురుగునీరు బ్రిడ్జి కింద నిల్వ ఉండి స్థానికులకు తీవ్ర అసౌకర్యం కలిగించడం తో పాటు దోమలు, దుర్వాసన, అనారోగ్య సమస్యలకు కారణమవుతోందని తెలిపారు. ఈ ప్రాంతంలో మురుగునీటి కాలువతో పాటు సిమెంట్ రోడ్డు నిర్మాణం అత్యవసరమని వివరించిన ప్రతినిధులు, దీనికి సంబంధించిన వినతిపత్రాన్ని రైల్వే అధికారికి అందజేశారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని త్వరితగతిన అనుమతులు మంజూరు చేసి పనులు ప్రారంభించేందుకు సహకరించాలని కోరారు. వినతి పై స్పందించిన దక్షిణ మధ్య రైల్వే ప్రధాన నిర్వాహక అధికారి సందీప్ మాథుర్ సమస్యను పరిశీలించి మురుగునీటి కాలువ, సిమెంట్ రోడ్డు నిర్మాణానికి అవసరమైన అనుమతులు మంజూరు చేసే దిశగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు ప్రతినిధులు తెలిపారు.

## ఉపాధి హామీ పనుల్లో
## గ్రామస్తుల ఉత్సాహవంతమైన భాగస్వామ్యం



**వెదురుకుప్పం,చిత్తూరు ఎక్స్‌ప్రెస్, జూన్13:** చిత్తూరు జిల్లా వెదురుకుప్పం మండలం పెరుమాళ్లపల్లి పంచాయతీలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు జోరుగా కొనసాగుతున్నాయి. ఫీల్డ్ అసిస్టెంట్ పి. వాసు పర్యవేక్షణలో శనివారం సుమారు 85 మంది కూలీలు ఉపాధి హామీ పనుల్లో పాల్గొన్నారు. గ్రామంలో జాబ్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరూ ఉపాధి హామీ పనులకు హాజరై పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఫీల్డ్ అసిస్టెంట్ పి. వాసు సూచించారు. ఉపాధి అవకాశాలను గ్రామీణ ప్రాంత ప్రజలకు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజా ప్రతినిధులు, రైతులు, గ్రామస్థులు కూడా పనులను పరిశీలించి కార్మికులను ప్రోత్సహించారు. ఉపాధి హామీ పనుల ద్వారా గ్రామాభివృద్ధితో పాటు గ్రామీణ కుటుంబాలకు ఆర్థిక భరోసా కలుగుతోందని వారు పేర్కొన్నారు. పనులను ఏపీవో, వర్క్ ఇన్‌స్పెక్టర్ రూపేష్ నిరం తరం పర్యవేక్షిస్తూ, మరింత మంది కూలీలు ఉపాధి హామీ పనుల్లో పాల్గొనేలా అవగాహన కల్పించారు. గ్రామంలోని అర్హులైన ప్రతి కుటుంబం ఉపాధి హామీ పథకాన్ని వినియోగించు కోవాలని అధికారులు పిలుపునిచ్చారు.

## సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

**పీలేరు, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, జూన్ 13:**



ముఖ్యమంత్రి సహాయ నిధి కింద మంజూరైన ఆర్థిక సహాయ చెక్కులను పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి బాధిత కుటుంబాలకు అందజేశారు. నగిరిపల్లిలోని ఎమ్మెల్యే కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో 21 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.20,13,365 విలువైన చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అనారోగ్యం, ప్రమాదాలు తదితర కారణాలతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో ఊరటనిస్తోందన్నారు. బాధితులకు ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటూ అవసరమైన సహాయాన్ని అందిస్తోందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా సాయం అందేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ప్రజలకు అవసరమైన సంక్షేమ పథకాలను చేరవేయడంలో ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందన్నారు. కార్యక్రమంలో వారణాసి శ్రీకాంత్ రెడ్డి, అమర్‌నాథ్ రెడ్డి, కిషోర్ నాయుడు, వసంతల రాజా, జయచంద్రారెడ్డి, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు. లబ్ధిదారులు ప్రభుత్వానికి, ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

## విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ



**ఎస్ఆర్‌పురం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, జూన్ 13:** ఎస్ఆర్‌పురం మండలం గుర్రంవారికండ్రిగ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శ్రీ లక్ష్మీ గ్రూప్స్ ఆధ్వర్యంలో విద్యా సామగ్రిని పంపిణీ చేశారు. సంస్థ అధినేత కె. ప్రసాద్ ఆధ్వర్యంలో పుస్తకాలు, పెన్నులు, నోట్‌బుక్లు, ఇతర పాఠశాల అవసరాల సామగ్రిని విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా కె. ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా విద్యను అభ్య సించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. నేటి చిన్నారులే దేశ భవిష్యత్తని, విద్యాభివృద్ధికి తమ వంతు సహకారం ఎప్పటికీ కొనసాగుతుందని తెలొపారు. ఒక విద్యా సంవత్సరానికి సరిపడే విధంగా సామగ్రిని అందజేయడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో శ్రీ లక్ష్మీ గ్రూప్స్ సిబ్బంది సోము, బన్నీ, శివ, పురుషోత్తం, పాఠశాల ఉపాధ్యాయుడు నందగోపాల్, ఇతర ఉపాధ్యాయులు, గ్రామస్థులు పాల్గొన్నారు. విద్యార్థులకు అవసరమైన సహాయం అందించిన సంస్థ ప్రతినిధులను పాఠశాల సిబ్బంది అభినందించారు.

## ప్రజా సమస్యల పరిష్కారంలో జాప్యం వద్దు



**పలమనేరు,చిత్తూరు ఎక్స్‌ప్రెస్, జూన్13;** చిత్తూరు జిల్లా పలమనేరు నియోజకవర్గం వి.కోట మండల నూతన తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన సూరప్రకాశ్ నాయక్ పలమనేరు ఎమ్మెల్యే అమర్‌నాథ్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలియజేసి, ప్రజలకు సంబంధించిన రెవెన్యూ సమస్యలను సకాలంలో పరిష్కరించాలని సూచించారు.భూ వివాదాలు, పట్టాదారు పాస్‌బుక్లు, మ్యూటేషన్లు, ఆదాయ, కుల, నివాస ధ్రువీకరణ పత్రాల జారీ వంటి అంశాల్లో పారదర్శకంగా, వేగవంతంగా సేవలు అందించాలని ఎమ్మెల్యే కోరారు. ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగకుండా సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా అధికారులు పనిచేయాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యమని, అధికారులు ప్రజల పట్ల సానుకూల దృక్పథంతో వ్యవహరించాలని సూచించారు. అనంతరం తహసీల్దార్ సూరప్రకాశ్ నాయక్ ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించి, ప్రజల సంక్షేమం కోసం సమన్వయంతో పనిచేస్తానని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, రెవెన్యూ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

Edited Printed Published & Owned by Dama VijayAKumar. And Printed at Vijay Publishers and Printers, #1-176, Anjur Village and Post, K.V.B.Puram Mandal, Tirupati District, Andhra pradesh.
Published at Vijay Publications, 1-176, Anjur Village and Post, K.V.B.Puram Mandal, Tirupati District, Andhra pradesh. EDITOR DAMA VIJAYAKUMAR, RNI. NO. APTEL/2023/86143